ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 04.04.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భారత ఫార్మా రంగం 'ప్రపంచ ఫార్మసీ'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.

2. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని చేపట్టినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

3. బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో ఉన్న సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు.

4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------------

ఫార్మా- వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి

భారత ఫార్మా రంగం 'ప్రపంచ ఫార్మసీ'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కేంద్ర వాణిజ్య శాఖ, ఫార్మెక్సిల్ సంయుక్తంగా నిర్వహించిన 'చింతన్ శివిర్ 2026' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత ఫార్మా రంగం ప్రస్తుతం 60 బిలియన్ డాలర్ల స్థాయికి

చేరుకుందన్నారు. ఇకపై కేవలం ఉత్పత్తి పరిమాణంపైనే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 140 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో 80  నుంచి 90 శాతం దేశీయ అవసరాలను మన పరిశ్రమలే తీర్చాలన్నారు. ముఖ్యంగా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ -API ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపునిచ్చారు. తద్వారా భౌగోళిక రాజకీయ మార్పుల ప్రభావం మనపై పడకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారానే ఫార్మా రంగం ప్రపంచ స్థాయిలో మరింత ముందుకు వెళ్లగలదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫార్మా జాయింట్ సెక్రటరీ సత్యప్రకాష్, ఫార్మా రంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, తదితరులు కూడా పాల్గొన్నారు.

**(ఎంఎస్)**

-------------------------------

సీఎం-విద్యా వ్యవస్థ

విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని చేపట్టినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా వంద ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బోధనను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం రవాణా సదుపాయంతో పాటు పౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం కూడా అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచడం ద్వారానే ప్రైవేటు వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్యను తగ్గించగలమని స్పష్టం చేశారు.

**(డెస్క్)**

---------------------------

**బాసర-జూపల్లి**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం- ట్రిపుల్ ఐటీ  క్యాంపస్ ను మంత్రి సందర్శించారు. నిన్న రాత్రి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, హాస్టల్ గదుల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలపై విద్యార్థులతో చర్చించినట్లు మంత్రి పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఉన్న సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

**(పిటిసి నిర్మల్ జిల్లా)**

-------------------------------

**పోలీస్ మీట్-సీఎం**

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుని హ్యాట్రిక్ సాధించిన తెలంగాణ పోలీసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మార్చి 29 నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయం రాష్ట్ర పోలీసుల నిరంతర కృషికి, క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్న ముఖ్యమంత్రి, టీమ్ గైడ్ చేసిన డీజీపీ బి. శివధర్ రెడ్డిని, సీఐడీ అదనపు డీజీ చారు సిన్హాను ప్రత్యేకంగా అభినందించారు.

**(డెస్క్)**

---------------------------

ఆదిలాబాద్-మహేశ్ గౌడ్

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్  విమర్శించారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇప్పటికే  22 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని

గుర్తుచేశారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, విద్య, వైద్య రంగాల ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఆదిలాబాద్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**(పీటీసీ, ఆదిలాబాద్)**

--------------------------

**ఆసిఫాబాద్-తనిఖీలు**

ఆసిఫాబాద్ తో పాటు కాగజ్‌నగర్ పట్టణంలోని పలు హోటళ్లపై రాష్ట్ర టాస్క్ ఫోర్స్, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో భాగంగా హోటళ్లలో గృహ అవసరాల కోసం కేటాయించిన వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించి, నిబంధనలను ఉల్లంఘించిన యజమానులపై కేసులు నమోదు చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

------------------------------------

**సిరిసిల్ల-ఆది శ్రీనివాస్**

సమాజ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి గీతేతో ఈ రోజు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన సులభతరమవుతుందని, ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ పరిసరాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

**(సౌండ్ బైట్ ఆది శ్రీనివాస్)**

**(పీటీసీ, సిరిసిల్ల)**

----------------------------

**సూర్యాపేట-ఖేలో ఇండియా**

సూర్యాపేట జిల్లా కోదాడలోని KRR డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్‌లో శిక్షకులుగా పనిచేసేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు తమ పూర్తి వివరాలు, సాధించిన పతకాలు, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో ఈ నెల 10వ తేదీలోపు సూర్యాపేట జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**(పీటీసీ, నల్లగొండ)**

--------------------------

**మూసీ-బీఆర్ఎస్**

ప్రభుత్వం మూసీ సుందరీకరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని, కానీ ఆ నెపంతో పేదల ఇళ్లను కూల్చివేసి విధ్వంసం సృష్టిస్తామంటే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. అధికారం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తూ తీర ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోందని విమర్శించారు.

**(డెస్క్)**

----------------------------

**సిరిసిల్ల-ఫారెస్ట్ ఆఫీసర్**

వన్యప్రాణుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అటవీ శాఖ అధికారిణి బాలమణి సూచించారు. వీర్నపల్లి మండలం  అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల కద లికలు పెరిగిన నేపథ్యంలో అటవీ ప్రాంతాన్ని సందర్శించి  పాద ముద్రలను పరిశీలించారు.

**(పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

-------------------------------

**సిరిసిల్ల-పవర్ లూమ్**

సిరిసిల్లలో తయారయ్యే రాజీవ్ విద్యా మిషన్ వస్త్రాల ఆర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంపై సీఐటీయూ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి టెస్కోకు ఇచ్చిన సుమారు 105 కోట్ల రూపాయల విలువైన ఏకరూప దుస్తుల తయారీ ఆర్డర్లను రద్దు చేస్తూ చేనేత శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో చేనేత కార్మికుల జీవనోపాధిపై పెద్దఎత్తున ప్రభావం పడుతుందన్నారు.

**(సౌండ్ బైట్ - మూషం రమేష్)**

**(పీటీసీ, సిరిసిల్ల)**

----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో  పెద్దగా మార్పు ఉండబోదని తెలిపింది. కాగా, నిన్న ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 40.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

**(డెస్క్)**

----------------------------